

ఆయకట్టుకు 'కడెం' నీరు
మరమ్మతుల అనంతరం కడెం ప్రాజెక్టు సిద్ధమైంది. వర్షాలతో ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. ఆయకట్టు రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. 8లో▸



గడువు పొడిగింపు
దానాపూర్-సికింద్రాబాద్/హైదరాబాద్ మధ్య వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల రాకపోకల గడువును పొడిగించారు. రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.9 /24.1

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కబ్జాలకు పాల్పడితే ఊరుకునేది లేదు'



కాగజ్‌నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్‌: కుండపోత వర్షానికి నాలా ఉప్పొంగి కాగజ్‌నగర్‌ పట్టణంలోని పలు కాలనీల్లో నీరు చేరడంతో శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆయా వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నాలాలను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాలాల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మున్సిపల్‌ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, కోండ్ర మనోహర్‌ గౌడ్‌, మాజీ కౌన్సిలర్‌ సిందం శ్రీనివాస్‌, కొండ తిరుపతి తదితరులు ఉన్నారు.

'ఆశ'లకు నిర్వహించే పరీక్ష రద్దు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశ కార్యకర్తలకు నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ డిమాండ్‌ చేశారు. ఆశ వర్కర్స్‌ యూనియన్‌, సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లుగా ఆశ కార్యకర్తలు కనీస వేతనాలకు నోచుకోకుండా, అధిక పనిభారంతో సతమతమవుతున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. పరీక్షను రద్దు చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లక్ష్మి, నవీన, భారతి, దేవి, పద్మ, పార్వతి, రూప, రేణుక పాల్గొన్నారు.


'ప్రజలే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు'



మాట్లాడుతున్న రామచంద్రారావు

కాగజ్‌నగర్‌రూరల్‌: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీకి ప్రజలే గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు అన్నారు. పట్టణంలోని కిమ్స్‌ ఆస్పత్రి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారం దిశగా ప్రతీ కార్యకర్త బాధ్యతగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, నాయకులు కొంగ సత్యనారాయణ, కొప్పుల శంకర్‌, దోని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే కాంగ్రెస్‌ ధ్యేయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

తిర్యాణి(ఆసిఫాబాద్‌): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు అన్నారు. తొలి విడతలో రూ.లక్ష లోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్‌ వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తుందన్నారు. ఇర్కపల్లి, గోయెగాం, కోయతలండి, అమీన్‌గూడ గ్రామాల్లో బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఆత్రం సుగుణ, జువ్వాజీ అనిల్‌గౌడ్‌, చిత్తారి సాగర్‌, మేడిశెట్టి శంకర్‌, పున్నంకుమార్‌, అమర్‌, రాజశేఖర్‌, వెంకటేశంగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



కాగజ్‌నగర్‌ మండలంలోని బురదగూడ చెరువుకు గండి పడి వృథాగా పోతున్న నీరు

- జిల్లాలో 66.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- కాగజ్‌నగర్‌ పట్టణంలో జలమయమైన కాలనీలు
- ఇళ్లలోకి చేరిన వరద.. నీట మునిగిన ద్విచక్ర వాహనాలు
- జలకళను సంతరించుకున్న చెరువులు, కుంటలు



సిర్పూర్‌(టి) మండలం చిన్నమాలినికి వెళ్లే రహదారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి

ఆసిఫాబాద్‌: జిల్లాలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం వర్షం దంచికొట్టింది. తొలిసారి జిల్లాలో 66.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కాగజ్‌నగర్‌లో 167 మి.మీ.లు కురవగా.. జైనూర్‌లో 23.6, సిర్పూర్‌- యూ 3.2, లింగాపూర్‌ 27.8, తిర్యాణి 29.6, రెబ్బెన 32, ఆసిఫాబాద్‌ 20.2, కెరమెరి 18.4, వాంకిడి 42.2, సిర్పూర్‌- టి 105.2, కౌటాల 97.8, చింతలమానెపల్లి 85.6, బెజ్జూర్‌ 97.6, పెంచికల్‌పేట్‌ 154.2, దహెగాంలో 89.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సీజన్‌ ప్రారంభమైన తొలిసారి భారీ వర్షం పడటంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కొన్నిచోట్ల పత్తి చేలను వరద ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఆసిఫాబాద్‌ మండలంలోని కుమురంభీం(అడ) ప్రాజెక్టులో భారీగా వరద చేరడంతో అధికారులు రెండు గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా శుక్రవారం 237.900 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు వద్ద 23.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 1304 క్యూసెక్కులుగా ఉంది.

రెడ్‌ అలర్ట్‌ జోన్‌లో జిల్లా

కౌటాల: జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా రెడ్‌ అలర్ట్‌ జోన్‌లో ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాణహిత, పెన్‌గంగ, వార్ధా నదుల పరీవాహక గ్రామాల ప్రజలతోపాటు పెద్దవాగు సమీపంలోని ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అకవాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేపల వేటకు వెళ్లొద్దని, వాగులను ప్రమాదకరంగా దాటొద్దని సూచించారు.

కొట్టుకుపోయిన కల్వర్టులు



చీలపెల్లికి వెళ్లే దారిలో కొట్టుకుపోయిన కల్వర్టు

సిర్పూర్‌(టి): మండల కేంద్రం నుంచి చీలపెల్లి మీదుగా మాలిని వెళ్లే రహదారిలోని వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ప్రధాన రహదారిపై ఉన్న రోడ్‌డ్యాంలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. చీలపెల్లి, పూసిగూడ, మేడిపల్లి, రావన్‌పల్లి గ్రామాలతోపాటు కాగజ్‌నగర్‌ మండలం చిన్న మాలిని, మాలిని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వర్షాలకు పత్తి చేలు వరద నీటిలో మునిగాయి. చింతకుంట, భూపాలపట్నం, కేశవపట్నం తదితర గ్రామాల ప్రజలు భారీ వర్షానికి ఇబ్బంది పడ్డారు.

దహెగాంలో కుండపోత



ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లన్న ఒర్రె

దహెగాం: మండలంలో గురువారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. చెరువులు, కుంటల్లోకి నీటితో కళకళలాడుతున్నాయి. ఐనం గ్రామ సమీపంలో రోడ్‌డ్యాంపై నుంచి వరద పారింది. పక్కనే ఉన్న పత్తి చేలల్లో వరద చేరడంతో పత్తి మొక్కలు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన దారిపై వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దహెగాంలో 8.9 సెంటీమీటర్లు, కుంచవెల్లిలో 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. పెద్దచెరువు నిండి అలుగు పోయడంతో పొలాలు కూడా చెరువును తలపించాయి.

దెబ్బతిన్న పత్తిచేలు



గంగాపూర్‌ శివారులో వరద ప్రవాహంతో దెబ్బతిన్న పత్తిపంట

రెబ్బెన: మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి చెరువులు, కుంటల్లోకి వరద చేరింది. ఆయకట్టు కింద సాగు చేసేందుకు సిద్ధం చేసిన వరి నార్లకు జీవం పోసింది. పెద్దవాగు, గంగాపూర్‌, లక్ష్మిపూర్‌, నవేగాం, పులికుంట వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. గంగాపూర్‌, పాశిగాం తదితర ప్రాంతాల్లో వరదకు పత్తి చేలు దెబ్బతిన్నాయి. గంగాపూర్‌లో మోర్లె వెంకయ్యకు చెందిన రెండెకరాల పత్తి పంట వరద ప్రవాహానికి కొట్టుకుపోగా మొక్కలపై ఇసుక మేటలు పేరుకుపోయాయి. మండలంలో సుమారు 80 ఎకరాల వరకు పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

కాగజ్‌నగర్‌ను ముంచెత్తిన వరద



కాగజ్‌నగర్‌ పట్టణంలో వరద నీటిలో బైక్‌లు

కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీల్లోకి వరద ముంచెత్తింది. దాదాపు రెండు గంటలపాటు జోరుగా వాన పడటంతో పలు కాలనీలు చెరువులను తలపించాయి. ద్వారకానగర్‌, సంజీవయ్యకాలనీ, శ్రీరాంనగర్‌, శ్రీనగర్‌ కాలనీల్లోని ఇళ్లలోకి కూడా వరద చేరింది. పట్టణంతోపాటు ఎగువన గ్రామీణ ప్రాంతాల నుంచి వరద రావడంతో నాలాలు ఉప్పొంగాయి. ఇళ్ల ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల(బాలికల)లోని నాలుగు తరగతి గదుల్లోకి వరద చేరింది. విద్యార్థులను తాత్కాలికంగా వేరే గదుల్లో కూర్చోబెట్టి బోధించారు. కాలనీల్లో పేరుకుపోయిన బురదను శుక్రవారం మున్సిపల్‌ అధికారులు ట్రాక్టర్లతో తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను పొక్లెయినర్‌తో తొలగించారు. ముంపుకు గురైన కాలనీలను ఆర్‌ఐ ఖాలిక్‌ పరిశీలించారు. బస్టాండ్‌ సమీపం నుంచి రైల్వేలైన్‌ వరకు ఉన్న ప్రధాన కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వరద నీరు ఇళ్లలోకి చేరిందని స్థానికులు ఆరోపించారు. శుక్రవారం ఉదయం పలు కాలనీల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. భారీ వర్షానికి కాగజ్‌నగర్‌ మండలం బురదగూడ గ్రామ చెరువు కట్టకు గండి పడి నీరంతా వృథాగా పోయింది. మరమ్మతులు చేయకపోవడంతో చెరువు కట్టకు గండిపడిందని గ్రామస్తులు తెలిపారు. చెరువులో చేపలు పట్టేందుకు జనం ఎగబడటంతో జాతరను తలపించింది.



ద్వారకానగర్‌లో పేరుకుపోయిన బురద తొలగిస్తున్న సిబ్బంది

అర్హులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



యూనియన్‌ బ్యాంకులో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: అర్హులైన ప్రతిఒక్కరికీ రుణమాఫీ అమలు చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా శాఖను అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి శుక్రవారం సందర్శించారు. రుణమాఫీ పథకం అమలు తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. రూ.లక్ష లోపు రుణం పొందిన వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు జమయిన మొత్తాన్ని రైతులకు చెల్లించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్‌ రాజేశ్వర్‌ జోషి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్లు వెంటనే ప్రారంభించాలి
మహిళలకు చేయూతనందించే దిశగా ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్లను జిల్లాలో త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళాశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్‌ పనులను శుక్రవారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులకు క్యాంటీన్‌ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళా శక్తి పథకంతో మహిళా సంఘాలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. సమీకృత కలెక్టరేట్‌ సముదాయంలో సోమవారం నాటికి క్యాంటీన్‌ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ, డీఎంహెచ్‌వో చెన్నకేశవులు, తహసీల్దార్‌ శ్రీనివాస్‌రావు, ఏపీఎం శ్రీనివాస్‌, మహిళా సంఘ సభ్యురాలు మార స్వరూపారాణి పాల్గొన్నారు.

'మహిళా శక్తి'లో పాడి పరిశ్రమకు అవకాశం

- అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

ఆసిఫాబాద్‌: మహిళా శక్తి పథకంలో పాడి పరిశ్రమకు అవకాశం కల్పించినట్లు అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి తెలిపారు. ఆసిఫాబాద్‌, రెబ్బెన, వాంకిడి, కాగజ్‌నగర్‌, సిర్పూర్‌-టి మండలాలకు చెందిన డెయిరీ ఫాం లబ్ధిదారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి విజయ డెయిరీ డైరెక్టర్‌ మధుసూదన్‌, పశువైద్యులు మురళి, స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ 15 రోజుల్లో సభ్యుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పశువుల రవాణా సమయంలో బీమా చేయించాలని సూచించారు. ఆసిఫాబాద్‌ మండలంలో పాడి పశువుల నుంచి వచ్చిన కొన్ని లీటర్ల పాలను విజయ డెయిరీకి ఇవ్వొచ్చన్నారు. అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, ఏపీఎంలు శ్రీనివాస్‌, రాజ్‌కుమార్‌, మహిళాశక్తి ఏపీఎం శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

'సంపూర్ణత అభియాన్‌'పై దృష్టి సారించాలి
నీతి ఆయోగ్‌ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా తిర్యాణి బ్లాక్‌ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి అంశాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మారుమూల గ్రామాలకు సైతం వైద్య సేవలందించే విధంగా కార్యాచరణ రూపొందించుకొని చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పోషకాహారం అందించాలన్నారు. గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, నీతి ఆయోగ్‌ జిల్లా సమన్వయ కర్త మణివేలు పాల్గొన్నారు.

'మాస్టర్‌ మైండ్‌' పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మాస్టర్‌ మైండ్‌ ఆన్‌లైన్‌ తరగతులకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, డీఈవో అశోక్‌ శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు మాస్టర్‌ మైండ్‌ ఆన్‌లైన్‌ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణితం, ఫిజికల్‌ సైన్స్‌, ఇంగ్లిష్‌ సబ్జెక్టులతోపాటు మోటివేషన్‌ క్లాసులను నిపుణులతో బోధిస్తారన్నారు. తరగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ట్రిపుల్‌ ఐటీ, సీవోఈ గురుకులం, పాలిటెక్నిక్‌ కళాశాలల్లో ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్‌ అధికారి మధుకర్‌, ఎస్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్‌: వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని యూటీఎఫ్‌ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు మాట్లాడుతూ పార్లమెంట్‌ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లిన నేపథ్యంలో వారి సర్వీసు పుస్తకాలు అప్‌డేట్‌ చేసేలా కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సర్వీసు పుస్తకాలను అప్‌డేట్‌ చేయకుంటే టీచర్లు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్‌ షిండే, కోశాధికారి రమేశ్‌, రవికుమార్‌, నాయకులు అశోక్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తే జైలుకే..



నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: గంజాయి విక్రయించినా, వినియోగించినా జైలుశిక్ష తప్పదని డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. జిల్లాలో గంజాయి సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కేసుల్లో నిందితులైన సుమారు 100మందిని డీసీపీ కార్యాలయానికి శుక్రవారం పిలిపించి ఆయా స్టేషన్ల ఎస్సైలు, సీఐల సమక్షంలో వారి కుటుంబ సభ్యుల ఎదుట కౌన్సెలింగ్ నిర్వహించారు. నిందితులపై హిస్టరీ షీట్ నమోదు చేసి వీరిపై రోజూ ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ.. నిందితులంతా ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఉన్న నేరస్తుల కదలికలను గమనించేందుకు జిల్లాలో ప్రత్యేక బృందం 24/7 పని చేస్తుందని తెలిపారు. పద్ధతి మార్చుకోకుంటే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసుల్లో రెండేళ్లు బెయిల్ రాకుండా జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. నిందితుల పేరుతో ఉన్న వాహనాలను సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. నిందితులు మారి ఇకపై ఎక్కడ గంజాయి రవాణా జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు. టోల్ ఫ్రీ 1446 లేదా 87126 71111 నంబర్లకు సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఏసీపీలు ప్రకాశ్, రవికుమార్, సీఐలు బన్సిలాల్ అశోక్, నరేందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ప్రహరీ ధ్వంసం

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన ముద్రకోల సదయ్య నూతన ఇంటి ప్రహరీపై గురువారం రాత్రి పిడుగుపడింది. గోడతో పాటు బోరు పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రూ.4లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. పిడుగు పడిన సమయంలో కుటుంబ సభ్యులు నలుగురు ఇంట్లో నిద్రిస్తున్నట్లు పేర్కొన్నాడు. డెప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్, ఆర్ఐ గణేశ్ శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన రైతు రామగుండం సంజీవ్ ఇంటి గోడ గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. ఇంట్లో మరో గదిలో అందరూ నిద్రించిన సమయంలో ఈ ఘటన జరగగా ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఐడియా పోటీలు నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఐడియా పోటీలు తప్పకుండా నిర్వహించాలని డీఈవో యాదయ్య ఆదేశించారు. శుక్రవారం పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనా క్ పై జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక ఇన్‌స్పైర్ మనాక్ అని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి నామినేషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 తుదిగడువు కాగా, ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు ఆగస్టు 30లోపు పూర్తి చేయాలని సూచించారు.

బీడీ కార్మికులకు జీవన భృతి చెల్లించాలి

పాతమంచిర్యాల: బీడీ కార్మికులకు రూ.4వేల జీవన భృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికులతో కలిసి ధర్నా చేసి అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యకుడు భూమన్న, జిల్లా కార్యదర్శి దారిశెట్టి అరుణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, జిల్లా అధ్యక్షురాలు అనిత, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

క్వారీ దుర్గాదేవి జాతరకు వేళాయె

- రేపు ఆలయ 53వ వార్షికోత్సవం
- ప్రకృతి ఒడిలో 'ఆషాఢ' పండుగ
- భారీగా తరలిరానున్న భక్తజనం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



ఎంసీసీ క్వారీలోని దుర్గాదేవి, పోచమ్మ ఆలయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎత్తైన కొండలు.. అందమైన రహదారులు.. దట్టమైన అటవీ ప్రాంతం.. అడవి మధ్య అందమైన ఆలయం.. అందులో అందమైన నీటి కొలనులు.. పక్షుల కిలకిల రావాలు.. అదే మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ.. ఇక్కడో ప్రత్యేకత ఉంది.. ప్రతీ ఏడాది ఆషాఢ మాసంలో క్వారీ గుట్టల్లోని దుర్గాదేవి జాతర నిర్వహించడం. ప్రకృతి ఒడిలో కొలువైన దుర్గమ్మా.. భక్తుల పూజలు అందుకుంటూ వారి కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా నిలుస్తోంది. ఇప్పుడు దుర్గాదేవి జాతర 53వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. హాజీపూర్ మండలం గఢ్పూర్ గ్రామపంచాయతీ పరిధి ఎంసీసీ (ఏసీసీ) క్వారీ దుర్గాదేవి జాతర ఆదివారం ఆషాఢం పౌర్ణమి రోజున జరగనుంది.

ఇదీ.. జాతర ప్రాముఖ్యత

మంచిర్యాలలో ఎంసీసీ (గతంలో ఏసీసీ) సిమెంట్ కంపెనీ ఉండేది (ప్రస్తుతం మూతపడింది). ఇందులో హాజీపూర్ మండలం గఢ్పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల పరిధిలోని గుట్టల్లో లభించే రాయితో సిమెంట్ తయారయ్యేది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు, ప్రాణనష్టం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాల నివారణకు కార్మికులు, కంపెనీ యాజమాన్యం మైసమ్మ, దుర్గాదేవి ఆలయాలను నిర్మించి ఏటా పూజలు చేస్తున్నారు. ఈ పూజలకు విశిష్టత ఏర్పడటంతో ఇక అప్పటి నుంచి ఏటా ఆషాఢంలో దుర్గాదేవి జాతర నిర్వహిస్తున్నారు. ఎంసీసీ అధికారులు, కంపెనీ సిబ్బంది కుటుంబ సమేతంగా వచ్చి క్వారీలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. రోజంతా అక్కడే ఉండి వంట చేసుకుంటారు. ఇక్కడే సామూహిక భోజనాలు చేయడం ఆనవాయితీ. ఆలయ ఆవరణలో నాగదేవుడు, పోచమ్మ దేవి ఆలయాలున్నాయి. సికింద్రాబాద్ మహంకాళి జాతర రోజునే ఎంసీసీ దుర్గాదేవి జాతరను నిర్వహిస్తున్నారు. ఇక్కడ వాహన పూజలు జరుగుతాయి. మేకలు, కోళ్ల బలి ఇస్తారు. అమ్మవారికి మొక్కులు సమర్పిస్తారు. అంగరంగ వైభవంగా జరిగే జాతరలో అంతా భాగస్వాములవుతుంటారు. జాతరకు మంచిర్యాల సమీప గ్రామాల నుంచే కాకుండా పెద్దపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు దేవి దర్శనం కోసం వస్తుంటారు. దుర్గాదేవి జాతర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయి అటవీ ప్రాంతం జనారణ్యంగా మారుతుంది.



ఆలయంలో కొలువుదీరిన దుర్గామాత

అలరించే ప్రకృతి అందాలు

క్వారీ జాతర దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. క్వారీకి వెళ్లే రహదారి అరకు లోయ, తిరుపతి కొండలను తలపిస్తుంది. ఎత్తైన గుట్టల నుంచి తీసిన రహదారి, మూల మలుపులు, పచ్చని చెట్లతో కళకళలాడుతుంది. ఎంసీసీ యాజమాన్యం గుట్టలపై పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ స్పాట్‌గా మార్చింది. ఆదివారం వచ్చిందంటే చాలు ఎంతో మంది ఇక్కడ ఉత్సాహంగా గడిపేవారు. మొన్నటిదాకా ఆహ్లాదాన్ని పంచిన క్వారీ అందాలు, నీటి కొలనులు, పచ్చని పార్కులు, క్వారీ నుంచి కంపెనీ వరకు సిమెంట్ రాయి తీసుకెళ్లే ఎలక్ట్రిక్ రోప్‌వే దృశ్యాలు నేడు కంపెనీ మూసివేతతో కనుమరుగయ్యాయి. దేవి ఆలయం పక్కనే పర్యాటకుల కోసం కాలక్షేప మండపం ఉండటంతో సమావేశాలు, ఫంక్షన్‌లు చేస్తారు. జాతర సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి క్వారీ దుర్గాదేవి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయి. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఐస్ ఫ్యాక్టరీలో చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

- రూ.2.5లక్షల విలువైన విద్యుత్ మోటర్లు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలోగల అయితరేతి రాజనర్సయ్యకు చెందిన నర్సింహ ఐస్‌ఫ్యాక్టరీలో ఈ నెల 17న జరిగిన చోరీ ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు శుక్రవారం ఆయన వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఐస్ ఫ్యాక్టరీలో రోజులాగే పనులు ముగించుకుని 16న రాత్రి ఫ్యాక్టరీకి, గేటుకు తాళాలు వేసి వెళ్లిపోయారు. ఉదయం వచ్చే చూసే సరికి గేటు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఫ్యాక్టరీలోని రూ.2.50లక్షల విలువైన 500 మీటర్ల కేబుల్ వైర్, ఆరు విద్యుత్ మోటర్లు, రెండు మెర్సిబుల్ పైపులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన వారి కోసం పోలీసులు గాలించారు. ఈ క్రమంలో దొంగిలించిన సామగ్రిని విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని స్థానిక ఐబీ చౌరస్తాలో పోలీసులు పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వారు హామాలీవాడకు చెందిన కలకుంట్ల ఖాజా, మహ్మద్ అబ్బాస్, కలకట్ల శివను అరెస్ట్ చేసి వీరి నుంచి దొంగిలించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై సురేశ్, సిబ్బంది ఉన్నారు.

వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల గడువు పొడగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వేశాఖ
- వారణాసి వెళ్లేవారికి ప్రయోజనం

బెల్లంపల్లి: దానాపూర్–సికింద్రాబాద్/హైదరాబాద్ మధ్య ప్రవేశ పెట్టిన వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల రాకపోకల గడువును పొడగిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వచ్చే ఆగస్టు 1వ తేదీ నుంచి క్రమంగా ఒక్కో స్పెషల్ ట్రైన్ రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నాయి. వారాంతంలో మాత్రమే నడిచే ఆయా ప్రత్యేక రైళ్లకు రాష్ట్రంలోని కొన్ని ముఖ్యమైన జంక్షన్లు, స్టేషన్లతో పాటు మహారాష్ట్రలోని ఓ ప్రధాన జంక్షన్‌లోనూ హాల్టింగ్ కల్పించారు. వీక్లీ స్పెషల్ ట్రైన్‌ల రాకపోకలను పొడగించడంతో ఉత్తరాదిన ఉన్న కాశీ (వారణాసి) వెళ్లే భక్తులు, ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఆయా వీక్లీ స్పెషల్ ట్రైన్‌లు కొంతకాలంగా రాకపోకలు సాగిస్తుండగా వాటిని మరికొన్ని నెలలపాటు నడిపించడానికి రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

పొడగించిన స్పెషల్ ట్రైన్స్

- పాట్నా–సికింద్రాబాద్ (రైలు నంబర్ 03253) వీక్లీ స్పెషల్ ట్రైన్ రాకపోకలు సాగించే ప్రస్తుత కాలపరిమితి ఈనెల 31 చివరి గడువు కాగా, కొత్తగా ఆగస్టు 5 నుంచి యథావిధిగా రాకపోకలు ప్రారంభించి ఆయా రైల్వేస్టేషన్లలో నిలుపుదలకు ఆదేశాలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 30 వరకు రాకపోకలు చేయడానికి గడువు పొడగించారు. సోమ, బుధ వారాల్లో ట్రైన్ నడుస్తుంది.
- హైదరాబాద్–పాట్నా (రైలు నంబర్ 07255) వీక్లీ స్పెషల్ ట్రైన్ ప్రస్తుతం రాకపోకలు సాగించే తుదిగడువు ఈనెల 31తో ముగుస్తుండగా, కొత్తగా అక్టోబర్ 2వరకు పొడగించారు. ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ ఆగస్టు 7నుంచి యథావిధిగా పునఃప్రారంభమవుతుంది. వారాంతంలో బుధవారం బయల్దేరుతుంది.
- సికింద్రాబాద్–పాట్నా (రైలు నంబర్ 07256) ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ ప్రస్తుత రాకపోకల గడువు ఆగస్టు 2వ తేదీతో ముగుస్తుండగా ఇది ఆగస్టు 9 నుంచి రాకపోకలు ప్రారంభిస్తుంది. తిరిగి సెప్టెంబర్ 27వ తేదీ వరకు రాకపోకలు సాగించడానికి గడువు పునరుద్ధరించారు. వారాంతంలో శుక్రవారం ఈ ట్రైన్ బయల్దేరి వెళ్తుంది.
- దానాపూర్–సికింద్రాబాద్ (రైలు నంబర్ 03225) స్పెషల్ ట్రైన్ ప్రస్తుత గడువు ఈనెల 25వ తేదీతో ముగుస్తుండగా, ఆగస్టు 1న ఈ ట్రైన్‌ను పునఃప్రారంభించి తిరిగి సెప్టెంబర్ 26వ తేదీ వరకు నడిపించడానికి ఆదేశాలు జారీ చేశారు. వారాంతంలో గురువారం ఈ స్పెషల్ ట్రైన్ నడుస్తుంది.
- సికింద్రాబాద్–దానాపూర్ (రైలు నంబర్ 03226) స్పెషల్ ట్రైన్ ప్రస్తుత కాల పరిమితి ఈనెల 28తో ముగుస్తుంది. కొత్తగా ఆగస్టు 4 నుంచి రాకపోకలు పునఃప్రారంభిస్తుంది. సెప్టెంబర్ 29 వరకు నడిపించడానికి గడువు పొడగించారు. కాగా, ఈ ట్రైన్ వారాంతంలో ఆదివారం మాత్రమే బయల్దేరుతుంది.

హాల్టింగ్ కల్పించిన స్టేషన్లు

వీక్లీ స్పెషల్ ట్రైన్‌లకు పలు ముఖ్యమైన జంక్షన్లు, స్టేషన్లలో నిలుపుదలకు అవకాశం కల్పించారు. సికింద్రాబాద్, కాజీపేట్ జంక్షన్, పెద్దపల్లి జంక్షన్‌తో పాటు బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో నిలుపుదలకు ఆదేశాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలోని బల్లార్షా జంక్షన్‌లోనూ ఆయా ప్రత్యేక రైళ్లు ఆగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఆయకట్టుకు 'కడెం' నీరు

- నేడో, రేపో విడుదల చేసే అవకాశం
- 690 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు



ఆయకట్టు కింద దుక్కి దున్నుతున్న రైతులు



కడెం ప్రాజెక్ట్

కడెం: నిర్మల్ జిల్లాలో ప్రాధాన సాగునీటి ప్రాజెక్టు కడెం. గతేడాది వచ్చిన వరదలతో గేట్లు కొట్టకుపోవడంతో యాసంగి ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. అయితే మరమ్మతులు తర్వాత ప్రాజెక్టు ప్రస్తుతం సిద్ధమైంది. ఎగువను కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద వస్తోంది. దీంతో క్రమంగా ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ఆయకట్టు ఆశాజనకంగా ఉంది. దీంతో వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

690 అడుగులకు నీరు..

కడెం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ)అడుగులు కాగా, ప్రస్తుతం 690 అడుగులకు చేరింది. దీంతో ఆయకట్టు కాలువలకు సాగు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు కాలువలను పరిశీలిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

రెండు జిల్లాల వరప్రదాయిని

కడెం ప్రాజెక్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాల వరప్రదాయిని. కడెం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని 68,150 ఎకరాలకు సాగు నీటిని అందిస్తుంది. ఆయకట్టు కింద వరి ఎక్కువగా సాగు చేస్తుంటారు. కాలువల లైనింగ్ దెబ్బతినడం, పలు చోట్ల గండ్లు పడడంతో చివరి వరకు సక్రమంగా సాగునీరు అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కాలువలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడో, రేపో కడెం నీటి విడుదల

కడెం ప్రాజెకునీటిమట్టం 690 అడుగులకు చేరడంతో ముందస్తుగానే కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రాజెక్టులో నిండా నీరున్నా.. గతే ఏడాది భారీ వరదలతో కాలువలు దెబ్బతినడంతో, ఆగస్టు నెలలో ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈఏడాది ప్రాజెక్టులో ఆలస్యంగా నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం ఆయకట్టు కింద నార్లు పోయగా, ఆయా మండలాల్లో చెరువులు, కుంటలు ఇంకా నిండాలేదు. దీంతో ఉన్న నీటిని ముందస్తుగా కాలువలకు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని నీటి పారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

మరమ్మతులు పూర్తి..

రెండేళ్లుగా వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9.26 కోట్లు కేటాయించింది. దీంతో వరద గేట్ల మరమ్మతులు చేపట్టారు. వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు, మోటార్లు, రబ్బర్ సీల్స్, బేరింగ్‌లు, వీల్స్, రోప్స్ తదితర నూతన విడి భాగాలను అమర్చారు. మరమ్మతులు పూర్తయిన వరద గేట్లకు పలుసార్లు ట్రయల్ రన్ చేశారు. ప్రాజెక్టును ఇటీవలే కలెక్టర్ అభిలాష అభినవ్, సీఈ శ్రీనివాస్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంతోషంగా ఉంది



కడెం జలాశయం నిండడం సంతోషంగా ఉంది. గతేడాది నీటి విడుదల ఆలస్యమవడం, యాసంగి పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించడంతో పంటలు సాగు చేపట్టలేకపోయాం. ఈ ఏడాది రెండు పంటలకు నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విష్ణు, రైతు, జన్నారం

నీటిని విడుదల చేస్తాం



కడెం ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. నీటి మట్టం 690 అడుగులు దాటగానే చెరువులు, కుంటలు నింపేందుకు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తాం.

– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్టు

చెరువు నింపాలి



వరినార్లు పోశాం. చెరువులు ఇంకా నిండలేదు. కడెం ప్రాజెక్టు కుడి కాలువకు నీటిని విడుదల చేయాలి. లేదంటే నాట్లు ఆలస్యమవుతాయి. కాలువలకు నీటిని విడుదల చేయడంతో చెరువులు నిండుతాయి.

– రహేల్, రైతు, పెద్దబెల్లాల్, కడెం

రక్షణ చర్యలు మరింత పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న సీతారామయ్య, పక్కన సీఎండీ

శ్రీరాంపూర్: గనుల్లో రక్షణ చర్యలు మరింత పటిష్టం చేయాలని గుర్తింపు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కంపెనీ స్థాయి సేఫ్టీ ట్రైపార్టీయేట్ సమావేశం జరిగింది. కంపెనీ సీఎండీ బలరాంనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాజమాన్యం, మైన్స్ సేఫ్టీ కమిటీ అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొని రక్షణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్మికల పక్షాన ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పలు సేఫ్టీ అంశాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల యాజమాన్యం రక్షణ పేరుతో ఎల్లో, రెడ్ కార్డులను తీసుకురావడంతో మైనింగ్ స్టాఫ్ ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గనుల్లో ప్రమాదాల నివారణకు మరింత టెక్నాలజీ అందిపుచ్చుకోవాలని, సీనియర్ కార్మికుల సలహాలు, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సీఎంఆర్ 2017పై సూపర్‌వైజర్లకు, సీఈఏఆర్ 2012 సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ రెగ్యులేషన్‌పై ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో నిమ్స్ టారిఫ్‌ల ప్రకారం కాకుండా ఆస్పత్రిలో కార్మికులకు కావాల్సిన మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సూపర్‌వైజర్లను మాత్రమే బాధ్యులను చేయడం మానుకోవాలని కోరారు. ఇటీవల చాలామంది కార్మికులు గుండె జబ్బులతో మరణిస్తున్నారని, కంపెనీ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్‌వైజర్లు, ట్రేడ్‌మెన్లను భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 17న గోదావరిఖనిలో ఓసీపీ–2లో జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్కే 7కు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకువచ్చి గనిని కొనసాగించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీతారామయ్య తెలిపారు. కంపెనీ అధికారులు, డీఎంఎస్, డీడీఎంఎస్ అధికారులు, ఏఐటీయూసీ నుంచి రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్య, కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లయ్య, వెంకటి హాజరయ్యారు.

గని ప్రమాదాలపై విచారణ చేపట్టాలి



సీఎండీతో మాట్లాడుతున్న బీఎంఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో వరుస గని ప్రమాదాలపై విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ నాయకులు కోరారు. శుక్రవారం బీఎంఎస్ జేబీసీసీఐ సభ్యుడు, సేఫ్టీ అన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు కే లక్ష్మారెడ్డి సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల ప్రమాదాల నివారణ, నిర్మూలన కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలనే నియమనిబంధనలున్నా కంపెనీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గనులు, రిస్క్ ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి కార్మికులను విధులకు పంపాల్సి ఉండగా ఇవేమీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కనీసం వెంటిలేషన్ కూడా అందించడం లేదని వాపోయారు. మైనింగ్ స్టాఫ్‌కు ఏరియా ఫిక్సేషన్ లేక వారి పర్యవేక్షణ ఇబ్బందిగా మారిందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కంపెనీలో రక్షణ విభాగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గోదావరిఖనిలోని ఓసీపీ–2లో ఇద్దరు కార్మికుల మృతికి కారణం అధికారుల పర్యవేక్షణ లోపమేనని ఆరోపించారు. కంపెనీ గత ఆర్థికసంవత్సరం సాధించిన లాభాలు ప్రకటించి అందులోంచి కార్మికులకు 40శాతం వాటా చెల్లించాలని సీఎండీని కోరారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, నాయకులు వేణుగోపాల్‌రావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గదులు శుభ్రం చేసిన విద్యార్థులు



వరండాలోని ఆవుపేడ తొలగిస్తున్న విద్యార్థులు

తాండూర్: మండలంలోని తాండూర్ ప్రాథమికోన్నత పాఠశాల (చిన్న బడి)కి గేటు ఏర్పాటు చేయకపోవడంతో ఆవులు, గేదెలు పాఠశాల ఆవరణలోనే సేదతీరుతూ పేడ వేస్తున్నాయి. దీంతో విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. తరగతి గదులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో శుక్రవారం విద్యార్థులే గదులను శుభ్రం చేసి పేడ తీసివేశారు. పాఠశాల పరిస్థితి, అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



తరగతి గదిని శుభ్రం చేస్తున్న విద్యార్థి

మహిళా ఉద్యోగులకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

మందమర్రిరూరల్: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు కనీస వసతులు కల్పించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రెస్ట్ రూంలు, టాయిలెట్స్, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు అందుబాటులో లేవని మండిపడ్డారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఇంతవరకు వారి సమస్యలపై పట్టించుకోలేదని ఆరోపించారు. యాజమాన్యం వెంటనే వారికి కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, కనీసం ఆరుగురు మహిళా ఉద్యోగులకు ఒక మహిళా సూపర్‌వైజర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు నారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సుదర్శన్, రామస్వామి, థామస్, ముఖేశ్, రాజేశ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గోదావరి మూలమలుపు వద్ద జరిగన రోడ్డు ప్రమాదంలో కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దుర్గం కుబేర్ (25) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుబేర్ బోరంపల్లి గ్రామం నుంచి బైక్‌పై చెన్నూర్‌కు వస్తున్నాడు. చెన్నూర్ గోదావరి రోడ్డులో ఏర్పాటు చేసిన బారికేడ్లకు బైక్ ఢీకొనగా కుబేర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.